క్లుప్తంగా

విద్యుత్ మీటర్ రీడర్ల వినతి



ఏపీఈపీడీసీఎల్ ఈఈకి వినతి ఇస్తున్న విద్యుత్ రీడింగ్ కార్మికులు

మల్కాపురం: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్ల వల్ల తమ ఉపాధికి ముప్పు ఏర్పడుతుందని విద్యుత్ మీటర్ రీడర్లు ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు రోడ్డున పడతాయని, ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ విద్యుత్ మీటర్ రీడర్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.కె.నాయుడు తదితర అధికారులను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీటర్ రీడర్లు మాట్లాడుతూ తమ ఉపాధికి భరోసా కల్పించాలని, ఎస్కో అకౌంట్ల ద్వారా ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని కోరామని తెలిపారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు.

నేడు జోన్-8 పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–8 పరిధిలోని వివిధ ప్రాంతాలకు బుధవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు మురళీకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణాపురం హెడ్ వాటర్ వర్క్స్ పంప్ హౌస్‌లో పంపుసెట్లు మరమ్మతులకు గురైనందున బుధవారం తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ ద్వారా వస్తున్న మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ పరిధిలోని బల్క్(రెసిడెన్షియల్/ఇండస్ట్రీస్ నీటి వినియోగదారులు, జోన్–8 పరిధిలో గల 93వ వార్డు పార్ట్, 98వార్డులోని సాయి దుర్గానగర్, దుర్గానగర్, కృష్ణానగర్, అప్పలనరసింహం కాలనీ, వెంకట సాయినగర్, బంట కాలనీ, రవినగర్, లక్ష్మీపురం, పోర్టు కాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకులం కాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివాని పాలెం, ఎల్ఐసీ కాలనీ, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాతగ్రామం, తెలకలవీధి, జెడ్పీ, హెచ్ఎస్ ఏరియా, ప్రశాంతినగర్, క్రాంతినగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపురి లే అవుట్, అడవివరం, ఎస్సీ కాలనీ, పాత అడవివరం తదితర ప్రాంతాల్లో బుధవారం తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

మందుబాబులకు రూ.1.10 లక్షల జరిమానా

గోపాలపట్నం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసుల్లో 11 మందికి 2వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె. మురళీకృష్ణ రూ.1.10 లక్షల జరిమానా విధించారు. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతేడాది డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో నమోదైన కేసుల్లో జరిమానాలు, శిక్షలు ఖరారయ్యాయి. ఇందులో ఇద్దరికి నాలుగు రోజుల జైలు శిక్ష వేశారు. పలువురికి జరిమానాలు విధించారు.

యాదవుల సమస్యలు పరిష్కరించండి

మల్కాపురం: యాదవుల సమస్యలు పరిష్కరించడంతో పాటు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీ యాదవ కార్పొరేషన్ డైరక్టర్ బత్తుల నాగేశ్వరరావును విశాఖ జిల్లా యాదవ మహిళా సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు తోణంగి వెంకటరమణి యాదవ్,యాదవ ఐక్య వేదిక నాయకులు ఆల్తి అప్పలనారాయణ,యాదవ ఉద్యోగుల సంఘ నాయకుడు వల్ల మహేష్ తదితరులు మంగళవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. యాదవుల సంక్షేమానికి శ్రమించాలన్నారు.

'భవన నిర్మాణ కార్మికుల చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ

సీతమ్మధార: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చలో ఢిల్లీ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996ను అమలు చేయడంలో వివిధ రాష్ట్రాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు..అధికారం చేపట్టిన 9 నెలలైనా ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు.

వెతలు పట్టవా?



జయేంద్రకాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం తవ్విన గుంతలపై ప్రజలు ఏర్పాటు చేసుకున్న నడక మార్గాలు

మురుగు కాలువలు, తవ్వేసిన గుంతలు, దుర్వాసన, దోమల బెడదతో జయేంద్రకాలనీ వాసులు నరకం చూస్తున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికి మార్గం లేక ఇబ్బందిపడుతున్నారు. నెలల తరబడి కాలువల్లో, రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.
– సింధియా



గుంతల్లో పేరుకుపోయిన వ్యర్థాలు





ఆవేదన చెందుతున్న స్థానిక ప్రజలు

జీవీఎంసీ 63వ వార్డు జయేంద్రకాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు పదినెలలు కావస్తున్నా పనులు చేపట్టలేదు. గుంతలు తవ్వివదిలేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా పందులు, కుక్కల సంచారం అధికమై బయటకు రావడానికి ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది.

గుంతలతో ప్రమాదాలు

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్విన గుంతల కారణంగా రోడ్లు ఇరుకయ్యాయి.దీంతో వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతలు తవ్వి దాదాపు నెల రోజులు కావస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఓ వీధి కుక్క గుంతలో పడి మృతి చెందింది. జీవీఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేసిన మూడు రోజులు పట్టించుకోలేదు. మంగళవారం తొలగించారు.



వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్న మురుగుకాలువలు

నీరు సైతం కలుషితం

పైపులైన్లు మురుగులో ఉండడంతో జీవీఎంసీ కుళాయిల నుంచి వచ్చే నీరు సైతం కలుషితమవుతుందని కాలనీ వాసులు వాపోతున్నారు. తాగునీరు ఎందుకు పనికి రాకుండా పోతుందని, ఇక కొన్ని ప్రాంతాల్లో లక్షల రూపాయలతో నిర్మించిన డ్రైనేజీలు సైతం పర్యవేక్షణ లేక దీనస్థితిలో ఉన్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. చెత్తతో పాటు భవన నిర్మాణ సామాగ్రిని సైతం ప్రధాన రహదారులకు ఇరువైపులా డంపింగ్ చేయడంతో జీవనానికి కూడా ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పనులు చేపట్టడంతో పాటు చెత్త తొలగించకపోతే ఆందోళనకు దిగుతామని కాలనీ వాసులు హెచ్చరిస్తున్నారు.



అవస్థలు పడుతున్నాం

గుంతలు తవ్వడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇంటికి వెళ్లే మార్గంలో గుంతలు తవ్వడంతో వాటిపై చెక్కలు అమర్చి నడక సాగిస్తున్నాం. ఒక్కోసారి జారి కాలువల్లో పడిన రోజులు ఉన్నాయి. తాగునీరు కలుషితమై నీటి కోసం చాలా ఇబ్బందిగా ఉంది. వేసవి కాలం కావడంతో తాగునీటి చాలా ఇబ్బందిగా ఉంది. అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలి.
–లక్ష్మి, దివ్యాంగురాలు



త్వరగా పనులు పూర్తి చేయాలి

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం గోతులు తవ్వి నెల రోజులు కావస్తున్నా పనులు మాత్రం ప్రారంభం రాలేదు. గుంతల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. సమస్యపై ఫిర్యాదు చేసినా అధికారులు మాత్రం పట్టించుకోలేదు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేసి మా ఇబ్బందులకు చెక్ పెట్టాలి.
– నాగమ్మ, 63వ వార్డు

కూటమి పాలనలో ప్రజా సమస్యలు గాలికి..

- సీపీఎం నాయకుల ఆగ్రహం
- 61వ వార్డులో సర్వే



సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, ఉరుకూటి బాబురావుయాదవ్ అన్నారు. ప్రజా సమస్యలతో పాటు అర్హులైన నిరుపేదలకు ఇంకా రాని ఇంటి పట్టాల సమస్యపై సర్వే చేపట్టారు. 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి వద్ద మంగళవారం జరిగిన సర్వేలో నాయకులు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంత పరిధిలో సుమారు రెండు వేల నిరుపేద కుటుంబాలు అద్దె ఇళ్లల్లో ఉంటున్నాయన్నారు. వీరిలో చాలామంది టిడ్కో ఇళ్ల కోసం అప్పులు చేసి డబ్బులు కట్టారని, వారికి ఏళ్లు గడిచినా ఇళ్లు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. అలాగే, పారిశ్రామిక పరిధిలోని చాలా ప్రాంతాల్లో నీటి సమస్య ఉందన్నారు. డ్రైనేజీలు, రోడ్డు మార్గాలు లేని ప్రాంతాలున్నాయన్నారు. దీనిపై పాలకులు స్పందించాలని, లేకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.కృష్ణారావు, ఎస్.విజయ, నమ్మి మహాలక్ష్మి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా డ్రాపౌట్స్ సర్వే

జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్



నేవల్ చిల్డ్రన్ స్కూల్ సిబ్బందికి సూచనలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

కంచరపాలెం: డ్రాపౌట్స్ పిల్లల వివరాలను పక్కాగా సేకరించి వాటికి సరైన కారణాలను సీఎస్ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. గోపాలపట్నం మండల పరిధి 104 ఏరియాలోని నేవల్ చిల్డ్రన్ పబ్లిక్ స్కూల్‌ను మండల విద్యా శాఖాధికారి డి.దివాకర్‌తో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మండలంలో 3,257 మంది డ్రాపౌట్స్ పిల్లలకు గాను 2,199 మంది కారణాలను మాత్రమే సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారని, మిగిలిన పిల్లల వివరాలను తక్షణమే నమోదు చేయాలని ఆదేశించారు. నేవీ స్కూల్ పిల్లలు ఇతర రాష్ట్రాలకు వలస పోవడంతో.. వారు ఏ ప్రాంతంలో ఉన్నారో తెలుసుకుని ఆయా పాఠశాలల వివరాలను సేకరించాలన్నారు. ప్రతి పాఠశాల యాజమాన్యం తమ స్కూల్ డ్రాప్ బాక్స్‌లో పెండింగ్ లేకుండా తక్షణమే క్లియర్ చేయాలని సూచించారు.

ఘనంగా పైడిమాంబ మారువారం జాతర



అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కంచరపాలెం: రామ్మూర్తిపంతులపేట వాసుల ఆరాధ్య దైవత, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన పైడిమాంబ అమ్మవారి మారువారం జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు వి.ఆంజనేయశర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక దర్శనాల కోసం భక్తులు బారులు తీరారు. ట్రస్టు సభ్యులు భక్తులకు మజ్జిగ, ప్రసాదం వితరణ చేశారు. ఆలయ పరిసరాల్లో భారీ సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో సుమారు 10 వేల మందికి భారీ అన్నసమారాధన చేశారు. సాయంత్రం మారువారం జాతరలో కోలాటాలు, తప్పెడుగుళ్లు, నేలవేషాలు నడుమ అమ్మవారి ఉత్సవ ప్రతిమను ఊరేగించారు. గ్రామాధ్యక్షుడు కొణతాల గోవింద్‌రాజు, కార్యదర్శి బొడ్డేటి నర్సింగరావు(చిన్న),ఉపాధ్యక్షుడు బొడ్డేటి పైడిరాజు,శ్రీనువాస్ ,పాలవర్గ సభ్యులు కె.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, బి.పైడిరాజు ఎ.పైడిరాజు, కె.సురేష్, బి.శేఖర్, ఎం.అప్పారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీఐఎస్ఎఫ్ ర్యాలీకి ఘన స్వాగతం



సీఐఎస్ఎఫ్ సిబ్బందికి సూచనలు



ర్యాలీకి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

కూర్మన్నపాలెం: సీఐఎస్ఎఫ్ సిబ్బంది సమృద్ధి సంరక్షణ పేరుతో చేపట్టిన సైకిల్‌ర్యాలీ మంగళవారం కూర్మన్నపాలెం చేరుకుంది. ఈ ర్యాలీకి పలు పాఠశాలల విద్యార్థులు, స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ర్యాలీలోని పాల్గొన్న సభ్యులు ఉక్కు పోరాట దీక్షాశిబిరం వద్ద కొంతసేపు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం శిబిరం ముందు ఫొటోలు గిగారు. ర్యాలీ ఎందుకు చేపడుతున్నారో వివరించారు. దేశంలోని ప్రైవేటు, ప్రభుత్వరంగ సంస్థల్లో భద్రత కోసం సీఐఎస్ఎఫ్ 1969 మార్చి 10వ తేదీన ఆవిర్భవించిందని వివరించారు. సుమారు 20 రాష్ట్రాల్లోని సంస్థల్లో అనునిత్యం భద్రత కల్పిస్తున్నామని వారు వివరించారు. ర్యాలీ అన్నవరం, అమలాపురం మీదుగా తమిళనాడు చేరుకుంటుందని తెలిపారు. ర్యాలీకి సీనియర్ కమాండర్ మహమ్మద్ హనీఫ్ సారథ్యం వహించారు.

26 పాఠశాలలు.. 146 ప్రాజెక్టులు

'కోరమాండల్'లో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



స్టాల్‌ను తిలకిస్తున్న కోరమాండల్ అధికారులు

మల్కాపురం: కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఆవరణలోని మైదాన ప్రదేశంలో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. పారిశ్రామిక ప్రాంతంలోని సుమారు 26 పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు వివిధ అంశాలపై రూపొందించిన 146 ప్రాజెక్టులను ఇక్కడ స్టాల్స్‌లో ప్రదర్శించారు. ముందుగా కార్యక్రమాన్ని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ పి.వి.రమణమూర్తి, ములగాడ తహసీల్దార్ భుజంగరావు, జోన్–5 జెడ్సీ రాము, కోరమాండల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల సృజనకు దర్పణంలా నిలుస్తాయన్నారు. అనంతరం విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించారు. సోలార్ యూనిట్ వల్ల విద్యుత్ ఆదా, వ్యర్థ జలాల నుంచి శుద్ధమైన నీటిని అందించే పరికరాలు, భూగర్భ విద్యుత్, డ్రైనేజీల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలు .. తదితర ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులు వాటిని సందర్శకులకు చక్కగా వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.

పెన్షనర్ల ఆందోళన



నిరసన తెలుపుతున్న పెన్షనర్స్

విశాఖ విద్య: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మద్రిపాలెంలోని పీఎఫ్ కమిషనర్ కార్యాలయం ఎదుట హైవే బస్ స్టాప్ వద్ద మంగళవారం పెన్షనర్లు ఆందోళన చేపట్టారు. కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసి అర్హులైన వారందరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని నినాదాలు చేశారు.పెన్షనర్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వం పెట్టుబడి దారుల సేవలో నిమగ్నమై, పెన్షనర్స్‌ను పట్టించుకోవడం లేదన్నారు. ధర్నా అనంతరం పీఎఫ్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అసిస్టెంట్ రీజనల్ కమిషనర్ జాస్తి పవన్‌కు వినతి పత్రం అందజేశారు.

రీసైక్లింగ్ సంస్థలను ప్రోత్సహించండి

ఎంవీపీకాలనీ: రోజు వారి జీవితంలో వినియోగించే ఉత్పత్తుల ను రీసైక్లింగ్ చేసి అందుబాటులోకి తెస్తున్న సంస్థలను ప్రోత్సహించాలని ఏయూ పర్యావరణ విభాగం మాజీ ఆచార్యు డు ఇ.యు.బి.రెడ్డి కోరారు. గ్లోబల్ రీసైక్లింగ్ డేను పురస్కరించు కుని మంగళవారం ఎంవీపీ కాలనీలోని సమత కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రీసైక్లింగ్ ఉత్పత్తుల ద్వారా సమాజానికి కలిగే లబ్ధిని విద్యార్థులకు వివరించారు. రీసైక్లింగ్ ద్వారా సహజ వనరులను కాపాడటం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం ద్వారా భావితరాలకు పర్యావరణాన్ని సురక్షితంగా అందించడం సాధ్యమవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో రీసైక్లింగ్ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, జె.వి.రత్నం పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వెల్‌నెస్ క్యాంప్‌లో పాల్గొన్న సంధ్యారావు పెంధార్కర్ తదితరులు

- నేవీ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు సంధ్యారావు
- 'కల్యాణ్ శివిర్' లో 250 మందికి వైద్య పరీక్షలు

సింధియా: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని నేవీ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు సంధ్యారావు పెంధార్కర్ సూచించారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని, జాగ్రత్తలు పాటించాలన్నారు. ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో కల్యాణ్ శివిర్ పేరిట ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఉమెన్ వెల్‌నెస్ క్యాంప్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ జీవనశైలి, వ్యాధుల సంక్రమణ, క్యాన్సర్ స్క్రీనింగ్, ఆహారపు అలవాట్లు, మానసిన శ్రేయస్సు కోసం పాటించాల్సిన నియమాలను వివరించారు. శిబిరంలో పాల్గొన్న సుమారు 250 మంది మహిళలకు ఈఎన్‌టీ, డెంటల్, ఎముకలు, స్త్రీ వైద్య నిపుణులు, కంటి వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందించారు. ఆహార అలవాట్లకు సంబంధించి పోషకాహార నిపుణులు సలహాలు, సూచనలు ఇచ్చారు.

క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ చూపాలి



బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను అభినందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆకాంక్షించారు. మంగళవారం తన కార్యాలయంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఆయన అభినందించారు. బెంగళూరు యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ మెన్స్ టోర్నమెంట్‌లో రన్నర్స్‌గా నిలిచిన ఏయూ క్రీడా జట్టును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండటం, పూర్తి సామర్థ్యాలను ప్రదర్శించడం ఎంతో ప్రధానమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, క్రీడా విభాగం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.